క్లుప్తంగా

సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం సైబర్ క్రైమ్, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాంచంద్రం గౌడ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరాస్పాండెంట్ ఎంఏ. బారీ, ప్రిన్సిపాల్ సెలీనా బారీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో సంబరాలు



సంబరాల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులు

రాయికల్: ఎమ్మెల్సీలో మొదటి ప్రాధాన్యత ఓటుతో ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్య భారీ మెజార్టీతో గెలవడం పట్ల బుధవారం రాయికల్ తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీఎం శర్మ, వేముల మధు, రాయికల్ మండల అధ్యక్షుడు రజనీకాంత్, ప్రచార కార్యదర్శులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిల్క్ సెంటర్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ రోడ్‌లో ఉన్న అమృత్ మిల్క్ సెంటర్‌లో బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యితో పాటు కాలం చెల్లిన పలు ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రజలు దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు వాటి గడువు తేదీని పరిశీలించాలని ఆమె సూచించారు. నిర్వాహకుడిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘ నాయకులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపులో కీలకంగా వ్యవహరించిన తపస్ యూనియన్ ఉపాధ్యాయులను బుధవారం స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, నాయకులు వడ్డెపల్లి శ్రీనివాస్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక నాయకులకు..

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక నాయకులను బుధవారం ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని హన్మాండ్లు నేతృత్వంలో పలువురు బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిట్టాపూర్ గ్రామంలో అగ్రవర్ణాల అధిపత్యానికి గండి కొట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలన్నీ సంఘటితమై ఐక్యవేదికను ఏర్పాటు చేసుకుని పోరాటం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గజ్జి రాజరెడ్డి, కొండ మధుపటేల్, వెంకటేష్, రాములు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో రాఘవులు

రాయికల్: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈవో రాఘవులు అన్నారు. పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీశ్, టౌన్ సెక్రటరీ గుగ్గిళ్ల మనోజ్ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో పరేషాన్

- చిన్నారులు, మూగజీవాలపై దాడి
- వీధుల్లోకి వెళ్లాలంటే జంకుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

వెల్గటూర్ : మండలంలోని పలు గ్రామాల్లో వీధికుక్కలు విజృంభిస్తున్నాయి. కుక్కలను అదుపు చేసేవారు లేకపోవడంతో వీధుల్లో గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ చిన్నా పెద్దా తేడా లేకుండా నిత్యం ఏదో ఒక చోట చిన్నారులు, మూగజీవాలు, బాటసారులు, వాహన దారులపై దాడి చేస్తున్నాయి. వీధి కుక్కలతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. కుక్కల దాడిలో గాయపడి మూగజీవాలు మృతి చెందిన సంఘటనలు కోకొల్లలు. అయినా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులు, మూగజీవాలపై దాడి

మండలంలోని కోటిలింగాలలో ఇటీవల మంచికట్ల మణితేజ అనే ఆరేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క బాలుడి మెడపై విచక్షణ రహితంగా దాడి చేయగా బాలుడు తీవ్రంగా గాయపడి రేబిస్ వ్యాధి సోకి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లాడు. బాలుని పరిస్థితి విషమంగా ఉంది. కొద్ది రోజుల క్రితం చెర్లపల్లిలో సంకటి మల్లయ్యకు చెందిన 20 గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేసి చంపగా, జగదేవుపేటలో నాలుగు గేదెలను దాడి చేసి చంపేశాయి. వెల్గటూర్ పీహెచ్‌సీ పరిధిలో గత నెల రోజుల వ్యవధిలో 45 పైగా కేసులు నమోదు అయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలకు శస్త్రచికిత్సలు కరువు

గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ బాటసారులపై, వాహన దారులపై, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో వదిలి పెట్టడం, కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి వాటిని నియంత్రించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పంచాయితీ రాజ్, వెటర్నరీ శాఖల మధ్య సమన్వయం లేక మా పరిధిలో లేదని నిర్లక్ష్యంగా సమాధానాలు దాటవేస్తున్నారు. అధికారులు స్పందించక పోవడం, కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో మూగ జీవాలు మృతి చెందుతున్నాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో కుక్కల బెడద ఎక్కువ ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టినందున పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ శాఖల అధికారులతో సమీక్షించి కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో వదిలేయడం, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం వంటి చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ నెరేళ్ల మోహన్‌రెడ్డి

మల్లాపూర్: సహకార సంఘం పాలకవర్గంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ప్యాక్స్ చైర్మన్ నెరేళ్ల మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సహకార సంఘంలో అవినీతి జరిగిందంటూ కొందరూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుత పాలకవర్గ హయాంలో ఎలాంటి అవినీతి జరుగలేదన్నారు. గత పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై స్పందించకుండా కొంతమంది పనిగట్టుకుని రైతులను తప్పుదోవ పట్టించి సహకార సంఘంపై బుదరజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పల్లం శంకర్, గమిని రాధ, బొందుగుల రాజరెడ్డి, ఎలాల నారాయణరెడ్డి, సంపతి పెద్దఅంజన్న, గడ్డం మారుతి, సురకంటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి విరాళం

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన హన్మంతు ప్రసాద్ తన పెన్షన్ నుంచి రూ.లక్ష రాయికల్ మండలం ఇటిక్యాలలోని నివేదిత వృద్ధాశ్రమానికి బుధవారం మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా చెక్కును అందచేశారు. హన్మంతు ప్రసాద్ జమున దంపతులను మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ఏడీఈ మనోహర్, మెట్‌పల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకులు సురభి భూంరావు, సుకేందర్‌గౌడ్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోసకాయలకు కేరాఫ్ ఆ పల్లెలు

- నాణ్యతతో పాటు తాజాగా ఉండటంతో డిమాండ్
- నేరుగా వినియోగదారులకే అమ్మకం



జగిత్యాలలో దోసకాయలు అమ్మేందుకు వచ్చిన రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు చాలా గ్రామాల్లో సంప్రదాయ పంటలు సాగు చేస్తే, ఈ గ్రామాల రైతులు మాత్రం సాధారణ పంటలతో పాటు స్వల్ప కాలంలో అదాయం వచ్చే దోసకాయ పంటను సాగు చేస్తున్నారు. పంట పండించిన రైతు లాభపడాలి లేదంటే ఆ ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారుడు లాభాపడాలనే నేరుగా దోసకాయలను సమీప పట్టణాల్లో విక్రయిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి, మద్దులపల్లి, నందగిరి, గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామాలు దోసకాయలకు కేరాఫ్‌గా మారాయి.

వినూత్న తరహాలో దోస సాగు..

ఆయా గ్రామాల్లో అభ్యుదయ రైతులు, దాదాపు 100 ఎకరాల వరకు వేసవి పంటగా దోసను సాగు చేస్తుంటారు. దోసకాయల్లో చాలా రకాలు ఉన్నప్పటికీ, సన్నగా, పొడవుగా, గింజలు లేని రకాలను, ఒక్కో రైతు కనీసం 10 గుంటల నుంచి అర ఎకరం వరకు సాగు చేస్తారు. వానాకాలంలో వరి లేదా మొక్కజొన్న సాగు చేసిన రైతులు, రెండో(వేసవి) పంటగా దోసకాయ సాగు చేస్తారు. విత్తనాలను మార్కెట్ నుంచి కొనుగోలు చేయకుండా, గతేడాది సాగు చేసిన దోసకాయల్లో మంచి నాణ్యత గల కాయలను ఎంచుకుని వాటి నుంచి విత్తనాలను తయారుచేసి, ఈ సీజన్‌లో పంట పండించడం విశేషం.

ప్రతి రోజు సమీప పట్టణాల్లో అమ్మకం..

మార్చి మొదటి వారంలో ఆయా గ్రామాల దోసకాయలు మార్కెట్‌కు వస్తుంటాయి. కాయలు తాజాగా ఉండేందుకు ప్రతి రోజు ఉదయం 7 గంటల లోపు తెంపుకుని, జగిత్యాల, కరీంనగర్, మల్యాల, గొల్లపల్లి, ఇతర సమీప గ్రామాలకు టీవీఎస్ మోటర్ సైకిళ్లు, సైకిళ్లపై వెళ్లి విక్రయిస్తుంటారు. కాయల నాణ్యత, డిమాండ్‌ను బట్టి ప్రస్తుతం కిలో రూ 80–100 వరకు పలుకుతుంది. ఒక్కొక్కరు తోటలోని కాయలను బట్టి 40 కిలోల వరకు రోజు విడిచి రోజు మార్కెట్‌కు తీసుకువస్తారు. కాయలు, ధరలను బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు సంపాదిస్తుంటారు.

ఆ పంట ఆ రైతులకు పవిత్రం

దోసకాయల పంట ఆయా గ్రామస్తుల రైతులకు పవిత్రం. స్నానం చేయకుండా వెళ్లితే ఆ తోటలోకి ఎవరిని రానీయరు, వారు సైతం వెళ్లరు. పంట తోటలోకి వెళ్లేటప్పుడు పవిత్రంగా ఉంటారు. పంటలో అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే 10 గుంటల్లో సీజన్ ముగిసే వరకు 15–18 క్వింటాళ్ల వరకు కాయ వస్తుందని, దాదాపు రూ 30–55 వేల వరకు సంపాదించే అవకాశం ఉంది. రైతులే స్వయంగా పనులు చేసుకుంటుండటంతో ఖర్చు కేవలం రూ 5 వేలలోపే ఉంటుంది. వేసవికాలంలో దోస కాయలకు చాలా డిమాండ్ ఉంటుంది. ప్రధానంగా మ్యాడంపల్లి గ్రామస్తుల స్ఫూర్తితో తక్కళ్లపల్లి, సుద్దపల్లి, రాఘవపట్నం గ్రామాల రైతులు సైతం దోసకాయల పంట సాగు చేస్తున్నారు.

దోసకాయల ఊరుగా పేరు



మా ఊర్లోనే దోసకాయలను ఎక్కువగా సాగు చేసి, దళారులకు అమ్మకుండా మేమే అమ్ముకుంటుండటంతో మా ఊరు దోసకాయల ఊరుగా పేరుగాంచింది. నేను 20 గుంటలు సాగు చేసిన. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఇతర పంటలతో పోల్చితే తక్కువ కాలంలో మంచి ఆదాయం వస్తుంది.

– తునికి శ్రీనివాస్, మ్యాడంపల్లి

వేసవి కాలంలో డిమాండ్



వేసవికాలంలో దోసకాయలకు మంచి డిమాండ్ ఉంది. ఉదయాన్నే దోసకాయలు తెంపుకుని జగిత్యాలకు వచ్చి రోడ్లపై అమ్ముతుంటాం. ఈ సారి వరి, మొక్కజొన్నతో పాటు స్వల్పకాల పంటగా చాల మంది రైతులు దోస సాగు చేశారు.

– అల్లె శంకర్, రైతు

అటవీ భూమి చదును చేసిన వారిపై కేసు

మెట్‌పల్లిరూరల్: ఆక్రమించుకునేందుకు అటవీ భూమిని చదును చేసిన విషయంలో ఒకరిపై కేసు నమోదైంది. మెట్‌పల్లి మండలం రంగారావుపేట బీట్ కంపార్ట్‌మెంట్ పరిధిలోని ఆత్మకూర్ శివారులోని సర్వే నెంబర్ 611/14లో అటవీ భూమి చదును చేసి ఆక్రమించుకుంటున్నట్లు అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.భూమిని చదును చేసిందెవరు..? ఎంత మేర భూమి చదును చేశారనే..? అనే విషయాలపై ఆరా తీశారు. దాదాపుగా 10 గుంటల మేర అటవీ భూమి చదును చేసినట్లు గుర్తించిన అధికారులు, పాటిమీది తండాకు చెందిన గుగ్లావత్ రాము అనే వ్యక్తి ఈ చర్యకు పాల్పడినట్లు తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జగిత్యాలక్రైం: పట్టణంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన అబ్బనమైని సురేశ్ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు. నాగేంద్రనగర్‌కు చెందిన సురేశ్ గత కొద్దికాలంగా కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం వెళ్లి వస్తుంటాడు. గత కొద్దికాలంగా అప్పులు ఎక్కువ కావడంతో రెండు రోజుల క్రితం భార్య శ్యామలతో గొడవ పడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూలభ్యం కాకపోవడంతో అతని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కథలాపూర్: సమతా సైనిక్ దళ్ శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్‌ను ప్రతినిధులు మండలకేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. అన్ని గ్రామాల ప్రతినిధులు కథలాపూర్‌లో సమావేశమయ్యారు. ఈనెల 8, 9 తేదీల్లో కోరుట్లలో సమతా సైనిక్ దళ్ శిక్షణ తరగతులుంటాయన్నారు. సభ్యులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శంకర్, మండల ప్రతినిధులు బోడ నాగరాజు, జంగం నరేశ్, రాధాకృష్ణ, లక్ష్మినర్సయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మల్లాపూర్: ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు బీజేపీ గ్రామ అధ్యక్షుడు పొన్నం శేఖర్ అన్నారు. మండలంలోని ఒబులాపూర్‌లో బుధవారం బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శేఖర్, లింగన్న, రాజరెడ్డి, ఇరాదు భూమేష్, పొన్నం విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామిని దర్శించుకున్న నాయకులు

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో జరుగుతున్న శ్రీమల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో బుధవారం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



రాయికల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద చెత్తాచెదారం ఉండటంతో పరిసర ప్రాంతాల్లో ఎస్సారెస్పీ నీరంతా వృథాగా పోతోంది. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఎస్సారెస్పీ నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: వినయ్ ఎస్సారెస్పీ ఏఈ, సెల్ నంబర్: 8106450334

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643



విద్యార్థుల వీడ్కోలు హంగామా

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్, కథలాపూర్‌లో మ్యాస్ట్రో హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ బుధవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నల్ల రాజయ్య, ఆకుల రంజిత్, కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీలో అక్రమాలపై చర్యలేవి?



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

మల్లాపూర్: సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీసీవోకి ఫిర్యాదు చేసినట్లు చిట్టాపూర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక నాయకులు అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డీసీవోకి ఇచ్చిన ఫిర్యాదులో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అవినీతిని వెలికితీయాలని కోరామని, తప్పుడు ఆరోపణలు చేయొద్దని ప్రస్తుత పాలకవర్గ చైర్మన్, సభ్యులు అన్న మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కోట్లాది రూపాయల అక్రమాలు జరిగిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. నష్టాల్లో ఉన్న సంఘం పాలకవర్గ ఎన్నికలకు మాత్రం రూ.20లక్షలను కేటాయించుకున్నారని మాజీ సీఈవో మీ పాలకవర్గంపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గుడికి తాళాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేటలో ఉన్న హరహర మహాదేవ శివాలయ ఆలయ అర్చకుడు ఉద్ధవ్‌బాబాపై దౌర్జన్యం చేసి ఆలయానికి తాళం వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ధూప, దీప, నైవేద్య ఆలయాల మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆలయ ఆవరణలో బుధవారం మాట్లాడుతూ 2022లో ఉద్ధవ్‌బాబాను అర్చకుడిగా ప్రభుత్వం నియమించిందన్నారు. స్థానికులు కొందరు వారం క్రితం ఆలయానికి వచ్చి ఆయనపై దౌర్జన్యానికి పాల్పడి తాళం వేశారన్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో వెంకటేశ్వరశర్మ, కృష్ణమాచార్యులు, కిషోర్, లక్ష్మణస్వామి, చక్రపాణి తదితరులున్నారు.

గోపా జిల్లా సమావేశం

జగిత్యాల జోన్: జిల్లా గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య గౌడ్, నాయకులు సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



కెనాల్ ఇలా.. నీరు పారేదెలా..?

వెల్గటూర్: మండల కేంద్రంలోని డీ–53 కెనాల్‌లో కోటిలింగాల కమాన్ వద్ద పిచ్చి మొక్కలు, తుంగ విపరీతంగా పెరిగిపోయింది. అలాగే కెనాల్‌ను ఆనుకుని ఉన్న ఎస్సీ కాలనీ నుంచి డ్రైయినేజీ మురుగు నీరు కెనాల్‌లో వదిలేయడంతో కెనాల్‌లో నీరు వెళ్లే పరిస్థితి లేదు. మురుగు నీరు మొత్తం కమాన్ వద్ద చేరి మురుగు నీటి కుంటలా మారింది. కెనాల్‌లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.